

క్యాబిన్‌లో నరకయాతన

ఆగి ఉన్న లారీని మిర్చిలోడ్డుతో వస్తున్న మరో లారీ ఢీకొట్టిన ఘటన గూడూరు హైవేలో సోమవారం చోటు చేసుకుంది. - 8లో



సంస్కరణల పేరిట సర్వనాశనం!

సంస్కరణల పేరిట విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేస్తోందని తల్లిదండ్రులు మండిపడ్డారు. - 8లో



రుయాలో టీడీపీ నేతల హల్‌చల్

రుయా ఆస్పత్రి అత్యవసర విభాగం ఎదుట టీడీపీ నేతలు హల్‌చల్ చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

ఆర్టీసీ ఆదాయం 'ఖాళీ'



తిరుపతి బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఆదాయానికి గండిపడుతోంది. జిల్లాలోని 11 బస్టాండ్లలో ఖాళీగా ఉన్న దుకాణాలకు సకాలంలో టెండర్లు నిర్వహించకపోవడంతో భారీగా ఆదాయం తగ్గిపోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల కాలంలో కేవలం ఒక సారి మాత్రమే టెండర్లు నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న బస్టాండ్లలో 476 దుకాణాలు ఉండగా అందులో 80కిపైగా దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఒక్క తిరుపతి డిపోలోనే 20కిపైగా దుకాణాలు ఖాళీగా ఉండడం గమనార్హం. అలాగే స్కూటర్ స్టాండ్ కూడా ఖాళీగా ఉంది. దీనిపై తిరుపతి బస్టాండ్ ఏటీఎం డీఆర్ నాయుడు మాట్లాడుతూ అన్ని దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తామన్నారు.

నేడు పెంచలకోనలో బ్రహ్మోత్సవాలపై సమీక్ష

రాపూరు: మండలంలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలపై మంగళవారం నెల్లూరు ఆర్డీఓ నాగసంతోషిణి అనూష ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఏసీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే 9 నుంచి 14వ తేదీ వరకు నృసింహుని బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించనున్నట్టు పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 104 అర్జీలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 95 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

భూసేకరణ వేగవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్‌తోపాటు వైద్యాధికారులు

తిరుపతి అర్బన్: వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలసి ఆయన అధికారులతో సమావేశమయ్యారు. అధికారులు సమన్వయంతో భూసేకరణ పూర్తి చేయాలని చెప్పారు. రెవెన్యూతోపాటు ఏపీఐఐసీ, ఆర్ అండ్‌బీ శాఖలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అలాగే నాయుడుపేట, మేనకూరు మండలాలకు సంబంధించిన ఏడు గ్రామాలలో భూ సేకరణ పెండింగ్లో ఉందన్నారు. తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరణ

ఈనెల 25న జరగనున్న ప్రపంచ మలేరియా దినోత్సవం పోస్టర్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్, వైద్యాధికారులు ఆనంద మూర్తి, బాబూ నెహ్రూరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 82,746 మంది స్వామివారిని దర్శించుకోగా 25,078 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని, కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలలో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

మెగా డీఎస్సీపైనే తొలి సంతకమంటూ ఊదరగొట్టిన చంద్రబాబు నాయుడు నిరుద్యోగులను నట్టేట ముంచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు పది నెలల తర్వాత హడావుడిగా తన పుట్టిన రోజును పురస్కరించుకుని డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 27,333 టీచర్ పోస్టులు ఖాళీ ఉన్నా కేవలం 16వేల పోస్టులతోనే సరిపెట్టేశారు. అభ్యర్థుల సన్నద్ధతపై ఎలాంటి ఆలోచనలు చేయకుండానే కేవలం 45 రోజులు మాత్రమే గడువు విధించారు. ఈ అతితక్కువ సమయంలో పరీక్షకు ఎలా ప్రిపేర్ కావాలో తెలియక నిరుద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. దీనికితోడు వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచి చేతులు దులుపుకోవడంపై పలువురు రగిలిపోతున్నారు. తెలంగాణాలో మాదిరిగా వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచాలని ఉద్యోగార్థులు డిమాండ్ చేస్తున్నారు. – తిరుపతి సిటీ



సన్నద్ధం.. సందిగ్ధం!

హడావుడి డీఎస్సీపై అభ్యర్థుల అసహనం

- సమయాభావం తక్కువంటూ పెదవి విరుస్తున్న వైనం
- వయోపరిమితి 46 ఏళ్లకు పెంచాలని డిమాండ్
- సన్నద్ధతకు కనీసం మూడు నెలలు అవసరం
- 45 రోజుల్లో పరీక్షలంటే ఎలా?
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

మూడు నెలలు అవసరం



లక్షల్లో పోటీ పడే డీఎస్సీ లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే కనీసం మూడు నెలల సమయం అవసరం. విస్తృత సిలబస్ 45 రోజుల్లో పూర్తి చేయడం అసంభవం. ఇప్పటికే ప్రిపరేషన్ ప్రారంభించి, ఏడాదిగా కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు నోటిఫికేషన్ విడుదల చేస్తారో లేదో అని నీరసించిపోయారు. వారు సైతం ఇప్పటి నుంచే ప్రిపరేషన్ ప్రారంభిస్తున్నారు. హడావుడిగా పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదు.

–కే.ప్రవల్లిక, ఎమ్మెస్సీ బీఈడీ, డీఎస్సీ అభ్యర్థి, తిరుపతి

ప్రిపరేషన్ ఎలా?



డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం ప్రిపరేషన్‌కు తక్కువ సమయం ఇస్తూ పరీక్షల షెడ్యూల్ విడుదల చేయడం బాధాకరం. లక్షల మంది పోటీ పడే పరీక్షకు కేవలం 45 రోజుల సమయం ఇవ్వడం విడ్డూరంగా ఉంది. కనీసం మూడు నెలలు సమయం కేటాయించాల్సి ఉంది. పేద విద్యార్థులు డీఎస్సీకి అవసరమైన పుస్తకాలను సమకూర్చుకుని ప్రిపరేషన్ ప్రారంభించేందుకు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఇక మిగిలేది 30 రోజులు మాత్రమే. ఆ తక్కువ సమయంలో డీఎస్సీలో నెగ్గాలంటే కష్టమే.

–ఎస్.చిన్న, ఎంఏ ఎంఈడీ, డీఎస్సీ అభ్యర్థి, తిరుపతి

హడావుడి తప్పదు



లక్షల మందిని ఎదుర్కొని ఉద్యోగం సాధించాలంటే సిలబస్‌ను పూర్తి స్థాయిలో చదవాల్సి ఉంటుంది. హడావుడిగా చదివి పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవడం పేద, సామాన్య విద్యార్థులకు కష్ట సాధ్యం. కోచింగ్‌లు, లేటెస్ట్ పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్స్ అతితక్కువ సమయంలో సమకూర్చుకోవడం అసంభవం. దీంతో పాటు ఖర్చుతో కూడుకున్న పని. మా లాంటి పేద విద్యార్థులు లైబ్రరీలపైనే ఆధారపడతాం. అలాంటి వారికి సమయం మూడు నెలలు ఇచ్చి ఉంటే బాగుండేది.

–నాగభూషణం, ఎమ్మెస్సీ, బీఈడీ, డీఎస్సీ అభ్యర్థి, తిరుపతి

వయోపరిమితి పెంచాలి



ఆంధ్రలో డీఎస్సీ నోటిఫికేషన్ 2018లో వచ్చింది. అప్పటి నుంచి చాలా మంది డీఎస్సీ కోసం వేచి చూస్తున్నారు. ఇప్పుడు వయోపరిమితి 44 ఏళ్లకు పెంచి నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో చాలా మంది అభ్యర్థులకు అవకాశం లేకుండా పోయింది. మాలాంటి అభ్యర్థులకు నిరాశే మిగిలింది. తెలంగాణాలో డీఎస్సీ వయోపరిమితి 46 ఏళ్లకు పెంచారు. ఆంధ్రలో కూడా అదేమాదిరిగా వయోపరిమితి పెంచి రీ నోటిఫికేషన్ ఇవ్వాలి.

–రామచంద్రారెడ్డి, బీఎస్సీ బీఈడీ, తిరుపతి

టెన్షన్ మొదలైంది



డీఎస్సీ పరీక్షలను ఎదుర్కోవాలంటే సుదీర్ఘ ప్రిపరేషన్ అవసరం. అలాంటిది రెండు నెలలు సైతం సమయం లేకుండా సిలబస్ పూర్తి చేయాలంటే ప్రతి అభ్యర్థికీ కష్టతరమే. ప్రిపరేషన్‌కు సమయం తక్కువ కావడంతో టెన్షన్ మొదలైంది. సిలబస్ పూర్తి స్థాయిలో కవర్ చేయగలమా అనే అనుమానం కలుగుతోంది. ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల చేసి ఉంటే బాగుండేది.

–ఎస్.జబ్రీన్, ఎంఏ టీటీసీ, డీఎస్సీ విద్యార్థిని, తిరుపతి

పోటీ ఎక్కువే



మెగా డీఎస్సీ పేరుతో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో రాష్ట్ర వ్యాప్తం 27,333 వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కానీ 16 వేల పోస్టులు మాత్రమే భర్తీ చేసేందుకు నోటిఫికేష్ ఇచ్చారు. పోటీ తీవ్రత ఊహించని రీతిలో ఉంటుంది. కనీసం 30 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి ఉంటే కొంత ఊరటగా ఉండేది. పోస్టులు తక్కువతో పాటు సమయాభావం పై దృష్టి సారించకుండా పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు.

–వేణు, బీఏ బీఈడీ, తిరుపతి

ధర్నాతో దద్దరిల్లిన కలెక్టరేట్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింలు, సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ నేతల నిరసన

తిరుపతి అర్బన్: ధర్నాలు, నిరసనలతో కలెక్టరేట్ సోమవారం దద్దరిల్లింది. 'ప్రాణ త్యాగానికైనా సిద్ధం.. మా భూములు ఇవ్వం' అంటూ రైతులు, 'వక్ఫ్ సవరణ చట్టం రద్దయ్యే వరకు పోరాటం చేస్తాం' మైనారిటీలు, 'సూపర్ సిక్స్' అమలు చేయాలంటూ కమ్యూనిస్టులు కలెక్టరేట్ వద్ద నిరసనలు, ధర్నాలు చేపట్టారు.

ప్రాణాలైనా అర్పిస్తాం.. భూములు ఇవ్వం

సత్యవేడు మండలంలోని ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం, రాళ్లకుప్పం, రాసపాళెం గ్రామాల్లో ఏపీఐఐసీ ద్వారా భూములు సేకరించడానికి ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 39ను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రాణాలైనా అర్పిస్తాం.. భూములు అయితే ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పారు. 2,583 ఎకరాలను సేకరించడానికి ప్రభుత్వం 39 జీవోను ఇవ్వడం అన్యాయమన్నారు. రెండు పంటలు పండే భూములను తీసుకోవద్దని భూసేకరణ చట్టంలో ఉన్నప్పటికీ ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. గతంలో సేకరించిన 7,246 ఎకరాలలో ఇప్పటికీ ఇంకా రెండు వేల ఎకరాల భూములు ఖాళీగా ఉన్నట్టు గుర్తుచేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాల్సిందే

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేసే వరకు పోరాటం ఆగదని ముస్లింలు కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకుని ధర్నా చేపట్టారు. 'లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక' ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, ముస్లిం సంస్థల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసన చేపట్టారు. ముస్లిం మనోభావాలను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందన్నారు. తక్షణం వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పీ.మురళి, వైఎస్సార్‌సీపీ నేత మహమ్మద్ ఖాద్రి ఇమ్రాన్, ఖాదిర్‌బాషా, మహ్మద్ ఖాసిం(చోట) మహ్మద్ మాలిక్, చాన్‌బాషా సులేమాన్, గఫూర్, జాఫర్ పులి పాల్గొన్నారు. అలాగే సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రటీస్ నేత వెంకయ్య ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ వెంటనే అమలు చేయాలంటూ నినాదాలు చేశారు.

గ్రీవెన్స్‌కు 372 అర్జీలు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి 372 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ సమస్యలపై 260 అర్జీలు ఉన్నాయి. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు అర్జీలను స్వీకరించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ముస్లిం నేతలు

వితంతు పింఛన్ కోసం వచ్చా

నా భర్త అనారోగ్యంతో మూడు నెలల క్రితం మృతి చెందారు. నాకు ఇద్దరు చిన్న బిడ్డలు ఉన్నారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. జీవించడం కష్టంగా ఉంది. వితంతువు పింఛన్ ఇప్పిస్తే ఆ డబ్బుతో ఇద్దరు చిన్నబిడ్డలను చూసుకోగలను. –షబినా, శ్రీకాళహస్తి

వికలాంగుల పింఛన్ ఇప్పించండయ్యా

నేను తిరుపతి ఇందిర్మ కాలనీలో ఉంటున్నా. దివ్యాంగుడిని. నాకు వికలాంగుల పింఛన్ ఇప్పించి న్యాయం చేయండి. –రమణయ్య, తిరుపతి


ఎమ్మెల్యే అన్న కొడుకు అరాచకం



మాట్లాడుతున్న బాధితుడు శ్రీమన్నారాయణరెడ్డి

తిరుపతి సిటీ: తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు ఆరణి శివ అరాచకాలకు అదుపులేకుండా పోతోందని స్థానికుడు శ్రీమన్నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరణి శివ తిరుపతిలో భూకబ్జాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఇందులో భాగంగా తిరుపతి నగరంలోని నారాయణపురం కైకాలచెరువు వద్ద ఉన్న సర్వే నం.3–2సీ2ఈ2ఏ 1బీ, 3–2సీ2ఈ2ఏ 1ఏ, ఏ2లోని రెండు ఎకరాల స్థలం తన భార్య డీ.స్వర్ణ పేరుపై ఉందన్నారు. దీన్ని కబ్జా చేసేందుకు పీలేరుకు చెందిన మనోహర్ అనే వ్యక్తితో కలసి ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ రజినీకాంత్, ఆరణి శివ ముగ్గురూ కలుసుకుని కబ్జా చేసేందుకు ప్రత్నిస్తూ, భయానక వాతావరణాన్ని సృష్టి స్తున్నారని వాపోయారు. సార్వత్రిక ఎన్నికల్లో తాను రూ.124 కోట్లు ఖర్చు పెట్టానని, ఆ డబ్బు తనకు ఎవరిస్తారు.. ఇలాంటి కబ్జాలు చేసుకుంటేనే కదా వచ్చేది అంటూ బాధితులను ఆరణి శివ బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులతో నగరంలో కబ్జాలకు, దందాలకు పాల్పడిన హిస్టరీని ఇంటెలిజెన్స్ నివేదికలను పరిశీలిస్తే బయటకు వస్తాయన్నారు. 2003 నుంచి 2024 వరకు 9 జడ్జిమెంట్లు వచ్చి కోర్టులో జరుగుతున్న దానిని తీసుకొచ్చి పోలీసులను పెట్టుకుని బెదిరిస్తున్నాడని తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ రజినీకాంత్ రాత్రి 20 మందిని వేసుకొని దాడి చేయడానికి వచ్చారని తెలిపారు. ఒక గవర్నమెంట్ అధికారి ప్రైవేట్ భూమిలో అర్ధరాత్రి 20 మందితో రావాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, సీఎం చంద్రబాబు నాయుడు తమకు న్యాయం చేయాలని కోరారు.

సముద్రంలోకి తాబేలు పిల్లలు



తాబేలు పిల్లలను సముద్రంలో విడిచి పెడుతున్న అధికారులు

వాకాడు: వాకాడు మండలం, నవాబుపేట సముద్ర తీరంలో సోమవారం జిల్లా ఫారెస్టు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, సిబ్బంది ఆలీవ్‌రిడ్లీ తాబేళ్ల పిల్లలను సముద్రంలో విడిచి పెట్టారు. నవాబుపేట వద్ద ఉన్న తాబేలుపిల్లల సంరక్షణా కేంద్రం(హేచరీ)లో నుంచి 540 పిల్లలను పలు జాగ్రత్తలతో సముద్రంలో విడిచి పెట్టారు.

'గురూ' నూతన మెడికల్ సర్టిఫికెట్లు తప్పనిసరి

- 24 నుంచి 26 వరకు రుయాలో ప్రత్యేక మెడికల్ క్యాంప్

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగులేషన్ యాక్ట్–2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరి/స్పెషల్ పాయింట్స్ పొందాల్సిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా నూతన మెడికల్ సర్టిఫికెట్‌ను తీసుకోవాలని డీఈఓ కేవీఎన్.కుమార్ స్పష్టం చేశారు. దీనికోసం తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తమ పాత ఆరోగ్య సర్టిఫికెట్‌ను చూపించి సంబంధిత వైద్యుల వద్ద పరిశీలన చేయించుకుని నూతన మెడికల్ సర్టిఫికెట్‌ను పొందాలన్నారు. ఈ క్యాంప్‌లో పొందిన మెడికల్ సర్టిఫికెట్ ఆధారంగానే ప్రిఫరెన్షియల్ కేటగిరి/స్పెషల్ పాయింట్స్ వర్తిస్తాయని చెప్పారు.

వీరే అర్హులు

భౌతిక వైకల్యం 56నుంచి 69శాతం వరకు, 70శాతం అంతకన్నా ఎక్కువ ఉన్న వారు, 80శాతం అంతకుమించి ఉన్న ఉపాధ్యాయులు, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ/ఆట్రియల్ సెప్టల్ డిఫెక్ట్/అవయవమార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, ఎముకల్లో టీబీ, కిడ్నీ మార్పిడి/డయాలసిస్, స్పైనల్ సర్జరీ, మానసికంగా బాధపడుతున్న భార్య/భర్త/పిల్లలు వైద్యం పొందే వారు, జువైనల్ డయాబెటిస్, థలసీమియా, హీమోఫీలియా, మస్కు లర్డిస్ట్రోఫీతో బాధపతున్న ఆధారిత పిల్లలు, వైద్యం పొందుతూ ఉండాలి, జన్మతః హృదయ రంధ్రాలు కలిగి ఆపరేషన్ చేసిన తేదీ నుంచి మూడేళ్లలోపున్న పిల్లల ఉపాధ్యాయులు అర్హులని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరికీ మెడికల్ చెకప్ వర్తిస్తుందని తెలిపారు.

పోలీస్ ఆస్పత్రి పనుల పరిశీలన



హాస్పిటల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైమ్: పోలీస్ ఆస్పత్రి రేనోవేషన్ పనులను ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం పరిశీలించారు. పోలీసులు ఆరోగ్యంగా ఉంటే మన జిల్లా అంతటా కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పోలీసులకు మంచి హాస్పిటల్ ఎంతో అవసరమన్నారు. రోజుకి ఎంతమంది ఆస్పత్రికి వస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

వివిధ సెక్షన్లలో తనిఖీలు

ఇది నిర్వహణలోని సిబ్బంది ఏం పనులు చేస్తున్నారని ఎస్పీ కార్యాలయంలోని వివిధ సెక్షన్లలో ఎస్పీ తనిఖీలు చేశారు. సకాలంలో విధులకు హాజరవుతున్నారా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

ఎనిమిది గేదెలు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గేదెలు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి, టెంకాయతోపు గ్రామం వద్ద సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఎనిమిది గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. స్థానిక ఎస్‌ఐ నాగరాజు వివరాల మేరకు.. టెంకాయతోపు గ్రామం వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం అతివేగంగా ఢీకొట్టడంతో ఎనిమిది గేదెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయన్నారు. మృతి చెందిన గేదెలు ఎవరికి సంబంధించినవి అనే విషయంపై కూడా సమాచారం లేదన్నారు.

టెన్నికాయిట్ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



మాట్లాడుతున్న శ్యాంసుందరరావు

గూడూరు రూరల్: తిరుపతి జిల్లా టెన్నికాయిట్ నూతన కార్యవర్గాన్ని తిరుపతిలోని అను ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ రాష్ట్ర చైర్మన్ వైడీ.రామారావు, రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్ ఆదేశాల మేరకు.. రాష్ట్ర అబ్జర్వర్ ఎస్‌టీ.ప్రసాద్, డీఎస్‌డీఓ షేక్ సయ్యద్‌సాహెబ్, రిటర్నింగ్ అధికారి (అడ్వకేట్) డాక్టర్ సీ.చంద్రశేకర్ పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్టు సభ్యులు పేర్కొన్నారు. టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ బండి శ్యాంసుందరరావు, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, కావలి మల్లికార్జున్, కార్యదర్శిగా గెరిటి చెంచయ్య, గూడూరు రమేష్, రాంబాబు, మహేష్, అరుణ్‌కుమార్, మునిరాజ, సీహెచ్ విజయలక్ష్మి, జగదీశ్వరరావు, మంజులను ఎంపిక చేసినట్టు తెలిపారు.

1, 2 తేదీలలో వాచీల ఈ- వేలం

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో భక్తు లు కానుకగా సమర్పించిన వాచీలను మే 1, 2 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం నిర్వహించనున్నారు. మొ త్తం 62 లాట్లు ఈ వేలంలో ఉంచినట్లు టీటీడీ పీఆర్వో టి.రవి ఒతెలిపారు. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం ఫోన్ నెంబర్ -0877-2264429 ద్వారా లేదా టీటీడీ వెబ్‌సైట్, రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

రుయాలో టీడీపీ నేతల హల్ చల్

- గంటన్నర పాటు అత్యవసర విభాగంలో హంగామా
- తీవ్ర ఇబ్బందులు పడ్డ రోగులు



108 అంబులెన్స్‌కు అడ్డుగా టీడీపీ నేతలు

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో టీడీపీ నేతలు సోమవారం హల్‌చల్ చేశారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారు. తిరుపతి ఒకటవ డివిజన్ మిట్టూరులో ఆదివారం రాత్రి రాములవారి ఊరేగింపు సందర్భంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతల మధ్య స్వల్ప వివాదం చెలరేగింది.

టీడీపీ నేతలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చితకబాదారు. పనిలోపనిగా తిరుపతి ఒకటవ డివిజన్ టీడీపీ అధ్యక్షులు వెంకటేష్‌కు కూడా స్వల్ప గాయమైంది. అతన్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. పరామర్శ పేరుతో పదుల సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆస్పత్రి వద్ద హైడ్రామా సృష్టించారు. ఫొటోలు, వీడియోల కోసం మీడియా ప్రతినిధులను వరుస పెట్టి పిలిపించుకున్నారు. ఒక్కో నాయకుడు వచ్చిన ప్రతిసారీ పరామర్శ కోసం వెళుతూ తీవ్ర అసౌకర్యాన్ని కలిగించారు.

వైద్య సేవలకు ఆటంకం

టీడీపీ నాయకుడిని పరామర్శించేందుకు శాప్ చైర్మన్ రవినాయుడుతో పాటు ఆ పార్టీ సీనియర్ నేతలు నరసింహయాదవ్, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, తిరుపతి నియోజకవర్గ పార్టీ అధ్యక్ష కార్యదర్శుడు చినబాబు మహేష్‌యాదవ్, వివిధ అనుబంధ సంఘాల నేతలు క్యూకట్టారు. సుమారు గంటన్నరకు పైగా అత్యవసర విభాగంలో హంగామా సృష్టించారు. టీడీపీ నేతలు పరామర్శకు రావడంతో ఆ బాధితుడు వద్దే అధికారులు చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. దీంతో చుట్టుపక్కల బెడ్లపై పడి ఉన్న రోగులకు సకాలంలో వైద్యం అందించలేకపోవడం గమనార్హం.

అంబులెన్స్‌లకు ఆటంకం

రుయా అత్యవసర విభాగానికి ప్రతి ఐదారు నిమిషాలకు ఒక అంబులెన్స్ వస్తుంటుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కడప, నెల్లూరు సమీప ప్రాంతాల నుంచి వైద్యం కోసం రుయాకు వస్తుంటారు. ఈ క్రమంలో సుదీర్ఘంగా టీడీపీ నేతలు అత్యవసర విభాగం వార్డులో తిష్ట వేయడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర విభాగం ముందు అంబులెన్స్‌లు నిలిపే ప్రాంతంలో తరచూ టీడీపీ నేతలు మీడియాతో మాట్లాడారు. ఈ క్రమంలో అత్యవసర విభాగానికి రోగులను తీసుకువచ్చిన అంబులెన్స్ కు దారి వదలకపోవడంతో సకాలంలో వారిని బెడ్లపై చేర్చలేకపోయారు. రైలు కిందపడి ఓ యువకుడి కుడికాలు పూర్తిగా తొలగిపోయి అత్యవసర వైద్యం కోసం రుయాకు వచ్చాడు. ఈ క్రమంలో టీడీపీ నేతలు మీడియాతో మాట్లాడడం వల్ల అంబులెన్స్ లోని ఆ యువకుడిని ఎమర్జెన్సీ వార్డులోకి తీసుకెళ్లేందుకు 10 నిమిషాల పాటు సమయం పట్టింది. దీంతో అక్కడ ఉన్న రోగులు, వారి సహాయకులు టీడీపీ నేతలపై మండిపడ్డారు.

క్యాబిన్‌లో నరకయాతన

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న మిర్చి లోడ్డు లారీ
- క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్, క్లీనర్లు

గూడూరు రూరల్: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీలోని డ్రైవర్, క్లీనర్‌లు ఇద్దరు క్యాబిన్‌లో ఇరుక్కు పోయి నరకయాతన పడిన సంఘటన పోటుపాళెం క్రాస్ రోడ్డు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది.. గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కథనం.. గుంటూరు నుంచి మిర్చీ లోడ్డుతో వెళుతున్న లారీ పోటుపాళెం క్రాస్ రోడ్డు సమపంలోకి వేకువజామున వచ్చింది. అప్పటికే అక్కడ రోడ్డుపై ఆగి ఉన్న మరో లారీని వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టి బోల్తాపడింది. లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు కాగా అందులోనే డ్రైవర్, క్లీనర్ ఇరుక్కు పోయారు. రోడ్డుపై లారీ బోల్తా పడడంతో నెల్లూరు వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మిర్చిలోడ్డు లారీ డ్రైవర్, క్లీనర్‌ను బయటకు తీసి గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకు వెళ్లారు. రోడ్డుకడ్డంగా పడిన లారీని తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

కలియుగదైవంతో ఆటలా?

- కూటమి అరాచకాలు శ్రుతి మించాయి
- గోవుల మృతిపై టీటీడీ చైర్మన్ అవహేళనగా మాట్లాడడం దురదృష్టకరం
- శ్రీకాళహస్తి పవిత్రతను అపహాస్యం చేయడం దుర్మార్గం
- శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌ను ఎమ్మెల్యే సుధీర్ క్లబ్‌గా మార్చేశారు



మీడియాతో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

తిరుపతి సిటీ: ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అరాచకాలు శ్రుతి మించాయని, కలియుగ దైవంతో సైతం ఆటలాడుతున్నారని, ఇది ప్రమాదకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి, నగరి నియోజకవర్గ పరిశీలకులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల గోశాలలో గోవుల మృతి శ్రీవారి భక్తులను కలచివేసిందన్నారు. గోశాలలోని గిర్ జాతి ఆవు గర్భంతో రైల్వే ట్రాక్‌పై పడి మరణించినా టీటీడీకి సంబంధం లేదంటూ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సాక్షాత్తు ఈఓ 46 ఆవులు చనియాయని చెప్పినా, సీఎం చంద్రబాబు మాత్రం గోశాలలో మరణాలు లేవని చెప్పడం దారుణమన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరు మెదపకపోవడం ఎమిటని ప్రశ్నించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గోశాలలో ఆవుల మృతిపై అవహేళనగా మాట్లాడడం శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి కేంద్ర నాయకులకు, మంత్రులకు దర్శనాలు చేయించుకుని వెలుగుతున్నాడని ఎద్దేవా చేశారు.

శ్రీకాళహస్తిని అపవిత్రం చేస్తున్నారు

జనసేన పార్టీ శ్రీకాళహస్తి ఇన్‌చార్జి వినూత పవిత్ర పుణ్యక్షేత్రాన్ని అపవిత్రం చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి రోజా ఓ కల్యాణ మండపానికి విచ్చేసిన సందర్భంలో ఆమె చిత్ర పటానికి చెప్పుల దండ వేయడం దారుణమన్నారు. ఈ దుశ్చర్య సాక్షాత్తు స్వామివారి కల్యాణం జరిగే ప్రదేశంలో జరగడం క్షమించరాని నేరమన్నారు. అలాగే శ్రీకాళహస్తిలో వైఎస్సాఆర్‌సీపీ నాయకులు ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ పెట్టేందుకు సైతం అనుమతులివ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి క్లబ్‌గా ప్రెస్‌క్లబ్‌ను మార్చేశారని ధ్వజమెత్తారు.

రెండు బైక్‌లు ఢీ

- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు



మృతి చెందిన గూడూరు మస్తాన్

ఓజిలి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన ఘటన ఓజిలి రాచపాళెం క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. గూడూరు పట్టణానికి చెందిన గూడూరు మస్తాన్(44) రాచపాళెం జాతీయ రహదారి పక్కనే ఉన్న తారుప్లాంట్‌లో వాచ్‌మన్, ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం విధులకు హాజరై రాత్రి రాజుపాళెం గ్రామంలోని దుకాణాల వద్దకు వెళ్లి తిరిగి తారుప్లాంట్‌కు రాంగ్‌రూట్‌లో వస్తున్నాడు. అదే సమయంలో లింగసముద్రం గ్రామానికి చెందిన ప్రవీణ్, సుధీర్ ఇంకో బైక్‌పై శ్రీకాళహస్తికి వెళ్లి పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో రాచపాళెం క్రాస్‌రోడ్డు సమీపంలోకి వచ్చే సరికి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గూడూరు మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ, సుధీర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సంస్కరణల పేరిట సర్వనాశనం!



గోపాలపురం ఎంపీయూపీ స్కూల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

- చిన్నాపట్టు, గోపాలపురం గ్రామస్తుల ఆందోళన

నాగలాపురం: విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని.. సంస్కరణల పేరిట సర్వనాశనం చేస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దూరంగా ఉన్న స్కూళ్లకు తమ పిల్లలను పంపించలేమంటూ మండలంలోని చిన్నాపట్టు, గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద సోమవారం పిల్లలతో కలిసి ఆందోళన చేపట్టారు. చిన్నాపట్టు పాఠశాల వద్దకు వెళ్లిన ఎంఈఓ బాబయ్యను విద్యార్థులు, తల్లిదండ్రులు చుట్టుముట్టి తమ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఊరికి దూరంగా వేరే పాఠశాలకు తమ పిల్లలను పంపలేమని చెప్పారు. అనంతరం కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే నూతన సంస్కరణలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు.

చెరువులో వ్యక్తి మృతదేహం



టైలర్ విజయమోహన్ మృతదేహం

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని తిమ్మాజికండ్రిగ గ్రామ చెరువులో వ్యక్తి మృతదేహం ఉండడాన్ని సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ బాబి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి ప్యాంటు చొక్కాతో పాటు అతని చెప్పులు సైతం చెరువు గట్టు వద్దే ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ముందుగా గుర్తుతెలియని వ్యక్తిగా భావించి విచారణ చేపట్టారు. అయితే మృతుడు పెళ్లకూరు మండలం, చెంబేడు గ్రామానికి చెందిన టైలర్ విజయ మోహన్(34)గా గుర్తించారు. మృతుడు నాయుడుపేట పట్టణంలోని బజారు వీధిలో కుట్టు మిషన్ల దుకాణం పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం చెంబేడులో ఉన్న ఇంటి నుంచి దుకాణానికి వెళుతున్నట్లు చెప్పి వెళ్లాడు. తిరిగి రాత్రి వరకు రాకపోవడంతో అతని ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు మృతుడి భార్య కోకిల పోలీసులకు తెలిపింది. మృతుడు తిమ్మాజికండ్రిగ చెరువు వద్దకు ఎందుకు వెళ్లాడు..? అనే విషయంపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే విజయ మోహన్ మద్యం మత్తులో చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాద వశాత్తు ఊబిలో కూరుకుపోయి మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనంతరం విజయమోహన్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య కోకిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

తిరుపతి క్రైమ్: నగరంలోని అబ్బన్న కాలనీలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. గుంటూరుకి చెందిన కృష్ణానాయక్(30) ఫొటో ఫ్రేములు చేసుకుంటూ తిరుపతిలోని అప్పన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. మూడు నెలల క్రితం గుంటూరు సమీపంలో వినుకొండ అనే గ్రామంలో మల్లికా బాయ్ అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఆమెతో కలిసి మూడు నెలల నుంచి తిరుపతిలోనే కాపురం ఉంటున్నాడు. అయితే ఏమైందో ఏమో గానీ ఆమె లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. పోలీసులు మాత్రం ప్రేమ వ్యవహారం వల్లనే ఇలా జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జోనల్ కార్యాలయం ప్రారంభం




తిరుపతిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎండీ మణిమేఖలై

తిరుపతి అర్బన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతిలో 9 జిల్లాలకు సంబంధించి ఐదు ప్రాంతీయ కార్యాలయాలను కలుపుకుంటూ తిరుపతిలో కొత్త జోనల్ కార్యాలయాన్ని ప్రారంభించింది. తిరుపతిలోని చెర్లోపల్లి సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయాన్ని సోమవారం ఎండీ అండ్ సీఐవో మణిమేఖలై చేతుల మీదుగా ప్రారంభించారు. జోనల్ హెడ్ శ్రీనివాసకుమార్, డిప్యూటీ జోనల్‌హెడ్ సూర్యప్రకాశ్‌రావు, ఎంవీకే కిషోర్ పాల్గొన్నారు.

డిగ్రీ హాల్‌టికెట్లలో గందరగోళం

- విద్యార్థుల జీవితాలతో ఎస్వీయూ అధికారుల ఆటలు
- ఒకే రోజు, ఒకే సమయంలో రెండు పరీక్షలు
- పరీక్షలను వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ



తప్పుల తడకగా విద్యార్థులకు అందజేసిన హాల్‌టికెట్లు

రెండు రోజులు వాయిదా

తిరుపతి సిటీ: ఎస్వీయూ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. మంగళవారం నుంచి ఎస్వీయూ పరిధిలో జరగాల్సిన డిగ్రీ రెండవ, నాల్గొవ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి హాల్‌టికెట్లు ఆదివారం నుంచి విడుదల చేశారు. విద్యార్థులకు జారీ చేసిన హాల్‌టికెట్లలో ఒకే సమయానికి రెండు పరీక్షలు రాయాలంటూ ముద్రించడంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు అవాక్కయ్యాయి. మరికొంత మంది హాల్‌టికెట్లలో పరీక్షల తేదీలు సైతం ముందు వెనక్కి మారిపోవడం విస్మయానికి గురిచేసింది. దీంతో జరిగిన తప్పును వర్సిటీ అధికారులకు మొరపెట్టుకోగా వెంటనే అధికారులు పరీక్షలను వాయిదా వేస్తూ సోమవారం అన్ని కళాశాలలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్వీయూ చరిత్రలో ఇలాంటి ఘటనలు జరగలేదని విద్యార్థులు, అధ్యాపకులు చర్చించుకుంటున్నారు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం నుంచి ప్రారంభం కావాల్సిన బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి దామ్లానాయక్ తెలిపారు. మొదటి రెండు రోజుల్లో జరగాల్సిన సబ్జెక్టులను మాత్రమే వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక కారణాల రీత్యా వాయిదా వేశామని, మొదటి రెండు పరీక్షలను మే 12 ,14 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జరగాల్సిన వివిధ సబ్జెక్టులు యథాతథంగా ఆయా తేదీల్లోనే జరుగుతాయన్నారు.

నన్నాపేదెవర్రా?



సొంత పనులకు పంచాయతీ చెత్త సేకరణ వాహనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'ఇది మా ప్రభుత్వం.. మేం చెప్పిందే వేదం..' అంటూ ఓ టీడీపీ కార్యకర్త రెచ్చిపోతున్న ఘటన పాకాల మండలంలోని పంటపల్లి పంచాయతీలో చోటుచేసుకుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన చెత్తసేకరణ వాహనాన్ని నడిపేందుకు ముద్దలపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పవన్‌ను డ్రైవర్‌గా నియమించారు. అతను పంచాయతీలో చెత్త సేకరణ తప్ప మిగిలిన అన్ని పనులకు ఆ వాహనాన్ని వినియోగిస్తున్నాడు. టౌన్‌లో టీ తాగడానికి, గడ్డి రవాణా కోసం, పొలం వద్ద నుంచి పచ్చి గడ్డిని తీసుకెళ్లేందుకు ఆ వాహనాన్నే ఉపయోగిస్తున్నాడు. ఈ విషయంపై ఎవరైనా ప్రశ్నిస్తే తమ ప్రభుత్వంలో ఎవ్వరూ ఏమీ చేయలేరని చిందులేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శి హరిణి అలసత్వం వల్లే ఇలా జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

తిరుపతి రూరల్ తహసీల్దార్‌పై..

క్రిమినల్ కేసు నమోదు చేయండి

- 164 బీఎన్ఎస్ఎస్ నోటీసు ఇవ్వడంలో నిబంధనలు ఉల్లంఘించారు
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు
- నాకు అన్యాయం చేసిన ఆయనపై కోర్టులో క్రిమినల్ కేసు ఫైల్ చేస్తున్నా
- మీడియా ముందు రిటైర్డ్ డీఎస్పీ భాస్కర్‌నాయుడు



మీడియాతో మాట్లాడుతున్న రిటైర్డ్ డీఎస్పీ భాస్కర్ నాయుడు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'తిరుపతి రూరల్ తహసీల్దారు రామాంజులు నాయక్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి.. పోలీసుశాఖలో సుదీర్ఘ కాలం పనిచేసి డీఎస్పీగా రిటైర్డ్ అయిన తరువాత కొనుగోలు చేసిన భూమిలో ఎలాంటి గొడవ లేకుండానే ప్రభుత్వం మంజూరు చేసిన లైసెన్స్ ద్వారా అక్కడ మద్యం దుకాణం పెట్టకుండా అడ్డుకునే క్రమంలో నాకు 164 బీఎన్ఎస్ఎస్ నోటీసు జారీచేశారు. ఆ నోటీసు ఇవ్వడంలో చట్టబద్ధమైన నిబంధనలు ఎక్కడా అనుసరించకుండా నన్ను భయపెట్టి మానసిక వేదనకు గురిచేసినందుకు ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణకు ఆదేశించాలి..' అని రిటైర్డ్ డీఎస్పీ ఎన్.భాస్కర్‌నాయుడు మీడియా ముందు తన ఆవేదనను వెళ్లగక్కారు. ఆయన చెప్పిన వివరాల మేరకు.. తిరుచానూరు గ్రామ రెవెన్యూ లెక్క దాఖల సర్వే నం .255-1బీలో 0.21 సెంట్లు భూమిని శ్రీనివాసపురంలో కాపురముంటున్న రిటైర్డ్ డీఎస్పీ భాస్కర్ నాయుడు కొనుగోలు చేశారు. ఆ స్థలంలో కొంతభాగం షాపు నిర్మాణం చేసి మద్యం అమ్మకాలకు కేటాయించారు. 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే ఈ భూమిపై అప్పటి స్థానిక ప్రజాప్రతినిధి బంధువుల కన్నుపడింది. తమ బినామీలతో నకిలీ డాక్యుమెంట్లు చేతబట్టుకుని అప్పటి తిరుపతి రూరల్ మండల తహసీల్దారు రాజగోపాల్, సర్వేయర్ సురేష్‌నాయుడు మరికొంతమంది రెవెన్యూ అధికారుల సహకారంతో ఐదుగురు వ్యక్తులకు అందులో హక్కు ఉందని నకిలీ రికార్డులు సృష్టించారు. దీనిపై భాస్కర్ నాయుడు కోర్టుకు వెళ్లగా ఆయనకు అనుకూలంగా న్యాయస్థానం తీర్పునిచ్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ భూమిపై మాజీ ప్రజాప్రతినిధి బంధువు ఆ భూమిని కాజేసేందుకు రంగంలోకి దిగారు. అంతేకాదు ఆ భూమిలో కొంత భాగాన్ని భాస్కర్‌నాయుడు మద్యం దుకాణం నిర్వహణకు కేటాయించగా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఏకంగా ఎక్సైజ్ అధికారులకు ఆ భూమి కోర్టులో ఉందని, అక్కడ మద్యం దుకాణానికి అనుమతించరాదని పిటీషన్లు కూడా పెట్టారు. అంతటితో ఆగకుండా తిరుపతి రూరల్ ఎస్ఐ రామకృష్ణకు తమ అనుచరుల ద్వారా ఫిర్యాదు చేయించి ఆ భూమిలో గొడవలు జరుగుతున్నందున అందులోకి ఎవ్వరూ ప్రవేశించకుండా చూడాలని మండల తహసీల్దారుకు రిపోర్టు పంపించేలా ఒత్తిడి చేశారు. అప్పటికే తిరుపతి రూరల్ తహసీల్దారుకు స్థానిక ప్రజాప్రతినిధి నుంచి ఫోన్లు చేయించగా ఎస్ఐ నుంచి రిపోర్టు వెళ్లిన గంటల వ్యవధిలో ఎలాంటి విచారణ చేయకుండానే తిరుపతి రూరల్ తహసీల్దారు రామాంజులునాయక్ గత ఏడాది అక్టోబర్ 23న భాస్కర్‌నాయుడుకు 164 బీఎన్ఎస్ఎస్ నోటీసులు జారీచేశారు. తన భూమిలో ఎలాంటి గొడవలు లేకున్నా న్యాయస్థానంలో తనకు అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ ఆ ప్రదేశంలో ఘర్షణలు జరుగుతున్నాయని, ఆ స్థలంలో ఎవ్వరూ ప్రవేశించరాదని నోటీసులు ఇవ్వడం పట్ల భాస్కర్‌నాయుడు జిల్లా కలెక్టర్‌ను కలసి తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రాలు అందించారు. అయినప్పటికీ ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయించి విచారణ జరిపించేలా న్యాయస్థానంలో ప్రయివేటు కేసు దాఖలు చేస్తున్నట్టు భాస్కర్ నాయుడు మీడియాకు వివరించారు. తనకు ఆ తహసీల్దార్ అన్యాయం చేశారని, ఒక రిటైర్డ్ పోలీసు అధికారిగా ఉన్న తనపైనే ఇలా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సామాన్య ప్రజలను వారు ఎలా ఇబ్బంది పెడుతున్నారో ఉన్నతాధికారులు గ్రహించి చట్ట ప్రకారం ఆ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.